క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో అన్నాభిషేకం



పెనమలూరు: పెదపులిపాక గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీవిజయరాజరాజేశ్వరి, శ్రీవిజయసుందరేశ్వరస్వామివారి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మాస శివరాత్రి సందర్భంగ ఆలయంలో శ్రీ విజయ సుందరేశ్వరస్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. అనంతరం స్వామివారికి అన్నాభిషేకం ఘనంగా చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



కంకిపాడు: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని వక్తలు పేర్కొన్నారు. ప్రొద్దుటూరు శివారు గాయత్రి విహార్‌లో శ్రీ వెంకటేశ్వర యోగ కేంద్రం గోసాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగ శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. యథాశక్తి యోగి గురూజీ మంద్రు శ్రీనివాసకుమార్, యువ యోగి నేరెళ్ల తులసీకృష్ణ, మునిజన వందిత యోగి డాక్టర్ కొక్కిలిగడ్డ వెంకట కృష్ణ యోగా వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. వ్యాధుల బారి నుంచి యోగ రక్షణ ఇస్తుందన్నారు. సామాజిక సేవలో గాయత్రి విహార్ అసోసియేషన్ చేస్తున్న కృషిని అభినందించారు. కార్యక్రమంలో కాకర్ల నాగేశ్వరరావు, వై.శ్రీనివాస్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సంఘం ఎన్నిక

పెనమలూరు: కానూరు వెలగపూడి దుర్గాంబ సిద్ధార్థ లా కాలేజీలో శనివారం పూర్వ విద్యార్థుల సంఘం ఎన్నిక శనివారం జరిగిందని కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ చెన్నుపాటి దుర్గాప్రసాద్ తెలిపారు. ఆయన వివరాలు తెలుపుతూ అధ్యక్షుడిగా ఎం.హరిబాబు, ఉపాధ్యక్షుడిగా షేక్ చాన్‌బాషా, ప్రధాన కార్యదర్శి వెంకటసూర్యనారాయణ, సహాయ కార్యదర్శి బీవీ.అరుణ దేవి, ట్రెజరర్ జి.మహంత్‌నాయక్, ఈసీ సభ్యులు ఎనిమిది మంది ఉన్నారన్నారు.

రేపు వ్యాయామోపాధ్యాయుల సమావేశం

గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ నెల 19న ఆంధ్రప్రదేశ్ క్రీడా పాఠశాలలో ప్రవేశం కోసం మండల స్థాయిలో వ్యాయామ సామర్థ్య పరీక్షలకు సంబంధించిన సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపిక కమిటీ కన్వీనర్ డి. నాగరాజు శనివారం తెలిపారు. ఎంపిక కమిటీ చైర్మన్‌గా ఎంపీడీవో సత్యకుమార్ వ్యవహరించనున్నట్లు పేర్కొన్నారు. పాఠశాల హెచ్‌ఎం ఎన్. రవీంద్ర భవాని అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండలంలోని వ్యాయామోపాధ్యాయులు హాజరు కావాలని కోరారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో పలువురికి ఉద్యోగాలు

గన్నవరం: మండలంలోని దావాజిగూడెంలో ఉన్న ఎస్‌టీటీఎఫ్ కళాశాలకు చెందిన ఎనిమిది మంది ఉద్యోగులు క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డి. మహీధర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల కాల పరిమితి కలిగిన డిప్లొమా ఇన్ టూల్ ఇంజినీరింగ్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్‌మెంట్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. వీరిలో ఎనిమిది మంది విద్యార్థులు హైదరాబాద్‌కు చెందిన డి-విన్నీ ఇన్నోవేటివ్ డిజైన్ సొల్యూషన్స్‌లో ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు.

నివేశన స్థలాలు అప్పగింత



ఉంగుటూరు: లంకపల్లి గ్రామంలో ఆర్‌అండ్‌బీ రహదారికి ఇరువైపుల ఉన్న పేదవారికి గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ ఆదేశాల మేరకు నివేశన స్థలాలను అధికారులు శనివారం అప్పగించారు. లంకపల్లి శివారు ఓంద్రంపాడులో జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలకు సర్వేరాళ్లు వేసి స్థలాలను అందజేశారు. ఎంపీడీవో శేషగిరిరావు, హౌసింగ్ ఏఈ సురేష్, ఈవోఆర్‌డీ బాషా పాల్గొన్నారు.

పేద విద్యార్థికి 'మానవత' ఆర్థికసాయం

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు మానవత ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మారుబోయిన కోటేశ్వరరావు అన్నారు. హనుమాన్‌జంక్షన్‌కు చెందిన బొడ్డుపల్లి సింహాద్రి నర్సారావుపేటలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఇటీవల తండ్రి మరణించటంతో కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకుంది. దీంతో మానవత స్వచ్ఛంద సేవా సంస్థను ఆశ్రయించటంతో రూ. 10 వేలు విరాళాన్ని మారుబోయిన శనివారం అందించారు.

ఆకలిదప్పులు తీరుస్తున్నారు..

- విజయవాడ పాత ఆస్పత్రిలో ప్రతిరోజూ 150 మందికి ఉచిత భోజనం
- చల్లటి నీరు, మజ్జిగ అందిస్తున్న వైనం
- అన్న సంతర్పణ సమితి ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహణ



రోగులు, అటెండెంట్‌లకు భోజనం వడ్డిస్తున్న దృశ్యం

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆకలి, దప్పికలను తీర్చడం కంటే మహత్కార్యం మరొకటి లేదు. అలాంటి గొప్ప పనికి శ్రీకారం చుట్టారు నగరంలోని అన్న సంతర్పణ సమితి ట్రస్టు సభ్యులు. రెండేళ్లుగా నగరంలోని మూడు వేర్వేరు ప్రాంతాల్లో ఉచిత భోజన పంపిణీ చేస్తుండగా, తాజాగా పాత ప్రభుత్వాస్పత్రిలోనూ ప్రారంభించారు. ఈ నెల 2న విజయవాడ పశ్చిమ, సెంట్రల్ ఎమ్మెల్యేలు వెల్లంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణుల చేతుల మీదుగా ప్రారంభమైంది. ప్రతి రోజూ 150 నుంచి 200 మందికి ఉచిత భోజన పంపిణీ చేయడంతో పాటు మజ్జిగ అందజేస్తున్నారు. అంతేకాకుండా వేసవి ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఉదయం నుంచి సాయంత్రం వరకూ 50 కూలింగ్ క్యాన్‌ల మంచినీటిని ప్రతి రోజూ అందచేస్తున్నారు.

ఒక్కో కేంద్రంలో 150 మందికి పైగా..

కోవిడ్ తర్వాత ఉచిత భోజనం పంపిణీ చేయాలనే ఉద్దేశంతో రెండేళ్ల కిందట అన్న సంతర్పణ సమితి ట్రస్టును ఏర్పాటు చేశారు. ఈ ట్రస్టులో రిటైర్డ్ ఉద్యోగులు, వ్యాపారులు, ఉద్యోగులు ఇలా 200 మందికిపైగా సభ్యులు ఉన్నారు. వీరందరూ కలిసి తొలుత వన్‌టౌన్ రథం సెంటర్‌లో ప్రతిరోజూ 100 నుంచి 150 మంది దుర్గగుడికి వచ్చే భక్తులకు ఉచితంగా భోజనం అందించడం ప్రారంభించారు. అలా ప్రారంభమైన ఉచిత భోజన పంపిణీని అనంతరం కొత్త వంతెన సెంటర్‌లోని ఆంజనేయగుడి వద్ద, బెంజిసర్కిల్ వద్దకు విస్తరించారు. ప్రతిరోజూ ఒక్కో కేంద్రంలో 150 మందికి ఉచితంగా భోజన పంపిణీ చేస్తున్నారు.

రోగుల ఆకలి తీర్చేందుకు..

అన్న సంతర్పణ సమితి సభ్యులు వేసవిలో పాత ఆస్పత్రికి వచ్చే వారి దప్పిక తీర్చేందుకు తొలుత కూలింగ్ మంచినీటిని ఏర్పాటు చేశారు. తొలుత ప్రతిరోజూ 20 క్యాన్‌లు పెట్టేవారు. తర్వాత 50 క్యాన్‌లు పెడుతున్నారు. ప్రసవం కోసం వచ్చే గర్భిణుల వెంట ముగ్గురు, నలుగురు అటెండెంట్స్ వస్తుంటారు. ఆ సమయంలో వారంతా వేచి ఉండటం చూసి ఉచిత భోజనం పెట్టాలని నిర్ణయించారు. అందుకోసం రూ.1.50 లక్షలు వెచ్చించి క్యాబిన్ ఏర్పాటు చేశారు.

నిరంతరం కొనసాగిస్తాం



ఇక్కడ ప్రసూతి విభాగానికి నగరం నుంచే కాకుండా, ఏలూరు, మచిలీపట్నం, భీమవరం వంటి దూర ప్రాంతాల నుంచి కూడా గర్భిణులు వస్తున్నారు. వారి వెంట ఆడవారే ఎక్కువగా ఉంటారు. వారు బయటకు వెళ్లి భోజనం చేయడం ఇబ్బందిగా ఉంటుందని భావించి ఇక్కడ ఉచిత భోజన పంపిణీ శిబిరం ఏర్పాటు చేశాం. ప్రతి రోజు 150 మందికి పంపిణీ చేస్తున్నారు. ట్రస్టు సభ్యులు, దాతల సహకారంతో ఈ కార్యాన్ని నిరంతరం కొనసాగిస్తాం.

– గుండు దిలీప్, అధ్యక్షుడు అన్న సంతర్పణ సమితి ట్రస్టు

జగనన్న సురక్ష పథకంతో సమస్యలకు సత్వర పరిష్కారం



పెనమలూరు మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటశివయ్య



ఉంగుటూరు ఎంపీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శేషగిరిరావు

పెనమలూరు: జగనన్న సురక్ష పథకంతో ప్రజల సమస్యలు గుర్తించి వెంటనే పరిష్కారం చేయాలని తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య తెలిపారు. పెనమలూరు మండల పరిషత్ కార్యాయంలో శనివారం సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రజల సమస్యలు సత్వరం పరిష్కారం చేయాలని ప్రభుత్వం ఈ నెల 23వ తేదీ నుంచి జగనన్న సురక్ష పథకాన్ని ప్రారంభిస్తోందన్నారు. మండలంలో తహసీల్దార్, ఎంపీడీవోలతో రెండు ప్రత్యేక టీంలు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం గ్రామాల్లో ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలు తెలుసుకొని వెంటనే పరిష్కారం చేసే విధంగా సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా ప్రభుత్వ పథకాలు అమలు, ధ్రువీకరణ పత్రాలు జారీ, డాక్యుమెంట్లు తదితర సమస్యలపై దృష్టి పెట్టి పరిష్కరిస్తామన్నారు. ఏ గ్రామంలో ఎప్పుడు టీంలు పర్యటించే వివరాలు ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సునీతాశర్మ, ఈవోపీఆర్డీ కోరా శ్రీనివాసరావు, పలు శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న సురక్ష పథకంపై అవగాహన

ఉంగుటూరు: జగనన్న సురక్ష పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో జీఎస్వీ శేషగిరిరావు అన్నారు. స్థానిక ఎంపీపీ కార్యాలయంలో జగనన్న సురక్ష పథకంపై పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో సన్నాహక సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం అనుబంధంగా ఈ నెల 23న రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించనున్న జగనన్న సురక్ష పథకంలో వచ్చే వినతులను క్షేత్ర స్థాయిలో పరిష్కరించేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని పేర్కొన్నారు. సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు సచివాలయం వద్ద జరిగే క్యాంపులపై అవగాహన కల్పించాలని సూచించారు. అర్హత ఉండి ఏదైనా సంక్షేమ పథకం అందని వారు ఉంటే గుర్తించి వారికి అవసరమైన పత్రాలను మంజూరు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ బాషా, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లతో సత్వర న్యాయం

మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు

చిలకలపూడి(మచిలీపట్నం): జాతీయ లోక్ అదాలత్ ద్వారా సత్వరమే కేసులు పరిష్కారం పొందే అవకాశం ఉందని మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు అన్నారు. జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ జులై 22న భూ సేకరణ, ఇన్సూరెన్స్ కేసులకు సంబంధించి ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తామని చెప్పారు. ఇందుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న కేసులను లోక్ అదాలత్‌కు సిఫార్సు చేసి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. భూ సేకరణ అంశంలో ఇబ్బందులపై కక్షిదారులు పలు కేసులు దాఖలు చేశారని, ఈ కేసుల్లో రాజీ మార్గంగా అధికారులు, కక్షిదారులతో మాట్లాడి పరిష్కారం పొందే విధంగా చూడాలన్నారు. మోటారు వాహన ప్రమాద క్లెయిమ్‌లకు సంబంధించి దీర్ఘకాలికంగా ఉన్న పెండింగ్ కేసులను ఈ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చునన్నారు. కక్షిదారులు తమ న్యాయవాదులను సంప్రదించి కేసులను లోక్ అదాలత్‌కు సిఫార్సు చేసుకుని పరిష్కరించుకోవచ్చని న్యాయమూర్తి సూచించారు. సమావేశంలో న్యాయమూర్తులు ఎస్.రామకృష్ణ, చినబాబు, ఎ.నరసింహమూర్తి, కేవీ రామకృష్ణయ్య పాల్గొన్నారు.

ప్రాధాన్యతా క్రమంలో డ్రెయిన్ల అభివృద్ధి



ఎనికేపాడు కేవీఆర్ కాలనీలో డ్రెయిన్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ పూర్ణచంద్రరావు

రామవరప్పాడు: గ్రామంలో ప్రాధాన్యత క్రమంలో డ్రెయిన్లను అభివృద్ధి చేస్తున్నామని ఎనికేపాడు సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు తెలిపారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడు కేవీఆర్ కాలనీలో పంచాయతీ నిధులు రూ. 5లక్షలతో చేపట్టిన డ్రెయిన్ నిర్మాణ పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పూర్ణ మాట్లాడుతూ సాయి బాబా ఆలయం నుంచి విన్సెంట్ నిలయం వరకు ఈ డ్రెయిన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు.

రూ. 90లక్షలతో రెండు వాటర్ ట్యాంక్‌లు

జలజీవన్ మిషన్ నుంచి రూ. 90లక్షల వ్యయంతో గ్రామంలో రెండు తాగునీటి వాటర్ ట్యాంక్‌లు నిర్మిస్తున్నట్లు సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు తెలిపారు. వాటర్ ట్యాంక్‌లు నిర్మించనున్న స్థలాలను శనివారం సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. పూర్ణ మాట్లాడుతూ గ్రామంలోని 24కే కల్యాణ మండపం వెనుక 1.20 లక్షల లీటర్ల సామర్థ్యంతో వాటర్ ట్యాంకు, అలాగే బీసీ శ్మశానవాటిక సమీపంలో 60వేల లీటర్ల సామర్థ్యంతో మరో వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. ఈ నెల 3వ వారంలో గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ చేతుల మీదుగా వీటి నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వివరించారు.

గోసాలలో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న సర్పంచి శ్రీనివాసరావు, వార్డు సభ్యులు

పెనమలూరు: గోసాల గ్రామంలో తారు రోడ్డు నిర్మాణానికి శనివారం రూ. 14 లక్షలతో శంకుస్థాపన చేశారు. గ్రామ సర్పంచి సంగెపు శ్రీనివాసరావు మాట్లాడుతూ పుట్ట కట్ట నుంచి సంతపాకల వరకు రోడ్డు నిర్మించాలని స్థానికులు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథిని కోరారన్నారు. ఎమ్మెల్యే చొరవతో మండల పరిషత్ నిధులు రూ. 10 లక్షలు, గ్రామ పంచాయతీ నిధులు రూ. 4 లక్షలు మంజూరు చేశామన్నారు. మొత్తం రూ. 14 లక్షలతో దాదాపు 800 మీటర్ల మేర తారు రోడ్డు నిర్మాణం చేపట్టామని సర్పంచి శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు ప్రవీణ్‌కుమార్, పీర్‌అహ్మద్, శ్రీను, గ్రామ వైఎస్సార్ సీపీ కన్వీనర్ పోలవరపు రవి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

గన్నవరం: రాష్ట్రంలో చేపడుతున్న విద్యారంగ సంస్కరణల్లో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం స్థానిక శాసనసభ్యుని కార్యాలయంలో ఫ్యాప్టో నాయకులు వినతిపత్రం సమర్పించారు. పాఠశాల వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్న జీఓ నెం. 117ను రద్దు చేయాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలని విన్నవించారు.

నేటి నుంచి కుంభాభిషేక పూజా కార్యక్రమాలు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని శ్రీకోదండ రామస్వామి ఆలయంలో ఆదివారం నుంచి మూడు రోజులపాటు మహా కుంభాభిషేక పూజా కార్యక్రమాలు జరుగనున్నాయి. ద్వాదశ ప్రతిష్టా వార్షికోత్సవం సందర్భంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు చెబుతున్నారు. 18వ తేదీన ఉదయం విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాశన, అగ్నిప్రతిష్టాపన, వాస్తు హోమం, అకల్మష హోమం, పూర్ణాహుతి జరిపిస్తారు. సాయంత్రం అఖండ దీపారాధన, 19న విశేష కుంకుమార్చన, 20న శ్రీకోదండ రామస్వామి వారికి అష్టోత్తర శతకల స్నపన, మహా కుంభాభిషేకం పూర్ణాహుతి, శ్రీసీతారామ కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు.

ముమ్మరంగా ఉపాధి పనులు

గన్నవరం రూరల్: మండలంలో ఉపాధి హామీ పథకం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. శనివారం 21 గ్రామాల్లో 4,670 మంది కూలీలు పనుల్లో పాల్గొన్నట్లు ఏపీవో సత్యప్రియ తెలిపారు. రానున్న ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఉపయోగపడే విధంగా పంట కాలువల తవ్వకం, చెరువుల పూడికతీత పనులు చేస్తున్నట్లు వివరించారు.

విత్తనాలు సిద్ధం

గన్నవరం రూరల్: మండలంలోని ఆర్‌బీకేలలో ఎంటీయూ 1061 విత్తనాలు రైతులకు అందించేందుకు సిద్ధంగా ఉంచినట్లు వ్యవసాయ అధికారులు శనివారం తెలిపారు. వచ్చే ఖరీఫ్ సీజన్‌కు రైతులు ఎక్కువగా సాగుచేసే విత్తనాలను ఇప్పటికే ఇండెంట్ ప్రకారం రప్పించినట్లు, సాగుచేసే రైతులు తీసుకోవాలని సూచించారు.

కార్పొరేట్ స్కూళ్ల దోపిడీని అరికట్టాలి

గన్నవరం: ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో పుస్తకాలు, యూనిఫామ్ పేరుతో జరుగుతున్న అధిక ధరల దోపిడీని అడ్డుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి చిల్లర రాజేష్ ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యా హక్కు చట్టం 42 ఆర్టికల్ ప్రకారం పాఠశాల పరిధిలో ఎటువంటి పుస్తకాలు, యూనిఫాం విక్రయాలు చేయకూడదనే ఆదేశాలు ఉన్నాయని చెప్పారు. అయినప్పటికీ గన్నవరం ప్రాంతంలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్‌లు, యూనిఫాంపై ఒక్కొక్క విద్యార్థిపై రూ. 5 వేలు నుంచి రూ. 8 వేలు వరకు అదనంగా వసూలు చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు సదరు పాఠశాలలో తనిఖీలు నిర్వహించి ధరల దోపిడీని అరికట్టాలని విజ్ఞప్తి చేశారు.

క్యాపిటల్ ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స

పెనమలూరు: పోరంకి క్యాపిటల్ ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స చేశామని ఆస్పత్రి ఎండీ డాక్టర్ ఎం.హరీష్ తెలిపారు. ఆయన శనివారం విలేకరులు వివరాలు తెలిపారు. క్యాపిటల్ ఆస్పత్రికి నాగలక్ష్మి(29) ఎడమవైపు గొంతు వాపు వ్యాధితో 20 సంవత్సరాలుగా బాధపడుతుందన్నారు. ఆమెకు ఈఎన్‌టీ వైద్యుడు డాక్టర్ బి.పవన్‌కుమార్ ఎంఆర్ఐ ఫిస్టిలో గ్రామం పరీక్ష చేసి ఆమెకు పుట్టుకతో ఈ వ్యాధి ఉన్నట్లు గుర్తించారు. డాక్టర్ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో నాగలక్ష్మికి నెక్ ఎక్స్‌ప్లొరేషన్ విత్ ఎక్సిషన్ ఆఫ్ మల్టిపుల్ ట్రాక్స్ ఆపరేషన్ చేసి నాలుగు ట్రాక్‌లు తొలగించామన్నారు. ఇది చాలా అరుదుగా వచ్చే వ్యాధని ఆమెకు తగిన చికిత్స చేసి సూచనలు ఇచ్చామన్నారు. ఈ సమావేశంలో సీవోవో శివరామ్ పాల్గొన్నారు.

మృతుడి ఆచూకీ లభ్యం

కంకిపాడు(పెనమలూరు): వడదెబ్బతో మృతి చెందిన వ్యక్తి ఆచూకీ లభ్యమైంది. ఎస్ఐ కె.సుధాకర్ కథనం మేరకు.. కంకిపాడు ఫ్లై ఓవర్ వద్ద శుక్రవారం ఓ గుర్తుతెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండటంతో స్థానికులు 108 అంబులెన్సులో కంకిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు ఆస్పత్రికి వెళ్లి వివరాలు సేకరించారు. వడదెబ్బ కారణంగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉయ్యూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అతని మరణంపై పత్రికల్లో వచ్చిన వార్తల ఆధారంగా మృతుడి బంధువులు గుర్తించి పోలీసులను శనివారం ఆశ్రయించారు. మృతుడు తాడిగడపకు చెందిన ఎం. నాగేశ్వరరావు (55)గా నిర్ధారణ అయ్యింది. బంధువుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

బాపులపాడులో అభివృద్ధి పనుల పరిశీలన



తిప్పనగుంటలో హిందూ శ్మశాన వాటిక అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న కృష్ణబాబు

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి మొవ్వా తిరుమల కృష్ణబాబు స్వగ్రామమైన బాపులపాడు మండలం తిప్పనగుంటలో శనివారం పర్యటించారు. గ్రామంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులపై ఆరా తీశారు. రూ.80 లక్షల వ్యయంతో అభివృద్ధి చేస్తున్న హిందూ, క్రైస్తవ శ్మశాన వాటికలను కృష్ణబాబు పరిశీలించారు. తుదిదశకు పనులు చేరుకోవటంతో అక్కడి అధికారులకు పలు సూచనలు చేశారు. శ్మశానవాటికల్లో పచ్చదనం పెంపొందించేందుకు మొక్కలు నాటాలని ఆయన సూచించారు. అనంతరం గ్రామంలో రూ. 17.50 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న ఆరోగ్య ఉప కేంద్రం, రూ. 21.80 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న రైతు భరోసా కేంద్రాలను పరిశీలించారు. త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలని, నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలని కాంట్రాక్టర్‌ను కృష్ణబాబు ఆదేశించారు. తొలుత ఆయన అభివృద్ధి కార్యక్రమాలు, గ్రామ సమస్యలపై పీఏసీఎస్ చైర్మన్ మూల్పూరి ప్రభుకాంత్, సర్పంచ్ కలపాల భీమయ్య, ఇతర గ్రామ ప్రముఖులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి అయిన కృష్ణబాబును వీరవల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కిరణ్మయి, సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిశారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంపై ప్రజల్లో లభిస్తున్న స్పందన గూర్చి ఆయన అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో అధికారులు చిత్తశుద్ధితో నిర్వహించాలని చెప్పారు. వీరవల్లి పీహెచ్‌సీలో గర్భిణుల డెలివరీలు, ఇన్ పేషంట్ జాయిన్ అయినప్పుడు అటెండెంట్లు ఉండేందుకు వీలుగా అదనపు గదిని నిర్మించాలని డాక్టర్ కిరణ్మయి విజ్ఞప్తి చేయటంతో ఆయన సానుకూలంగా స్పందించారు. పలువురు అధికారులు, గ్రామస్తులు కృష్ణబాబును కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. సంబంధిత శాఖల అధికారులతో వెంటనే ఫోన్‌లో మాట్లాడిన కృష్ణబాబు పరిష్కరించాలని ఆదేశించారు.

విద్యార్థుల ఉజ్వల భవితకు కృషి



విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు

కంకిపాడు: విద్యార్థుల ఉజ్వల భవితకు సీఎం జగన్ కృషి చేస్తున్నారని జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు అన్నారు. కోలవెన్ను జెడ్పీ పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం శనివారం నిర్వహించారు. పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను ఘనంగా సత్కరించి నగదు ప్రోత్సాహకాలను అందించారు. జెడ్పీటీసీ బాకీ బాబు మాట్లాడుతూ జగనన్న విద్యాకానుకతో కార్పొరేట్ తరహాలో పుస్తకాలు, యూనిఫాంలు, బ్యాగులను అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనన్నారు. నాడు-నేడుతో పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన సమర్థంగా సాగుతుందన్నారు. వసతులను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సీహెచ్ సురేష్, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ బాసా, మాజీ సర్పంచ్ టెక్కెం సతీష్‌కుమార్, మాజీ ఉపసర్పంచ్ శేషగిరి, హెచ్‌ఎం ఏ.ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి



వణుకూరులో చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే

పెనమలూరు: తల్లులు అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకొని వారి పిల్లలకు బంగారు భవిష్యత్తు కల్పించాలని వణుకూరు గ్రామ సర్పంచి చెక్క విజయ అన్నారు. వణుకూరు అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం జనభాగీదారి కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచి చెక్క విజయ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారుల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. చిన్నారులకు పోషకాహారం అందించటమే కాకుండా వైద్యం, ప్రీస్కూల్ సేవలు ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. ఉప సర్పంచి గద్దల రాజా, సూపర్‌వైజర్ టి.నాగరమామణి, వార్డు సభ్యుడు బి.నాగరాజు, మహిళా సంరక్షణ కార్యదర్శి డి.వికల్ప తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

రామవరప్పాడు: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని వాటిని సాధించే దిశగా ముందుకు వెళ్లాలని ప్రముఖ మానసిక వ్యక్తిత్వ వికాస నిపుణుడు శ్రీపతి జగదీష్ అన్నారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని విజయ మహిళ ఫార్మసీ కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో శనివారం 'మానసిక వ్యక్తిత్వ వికాసం' అంశంపై శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ విద్యార్థులు తమ ఆలోచనలు పెడదారిన పడకుండా జాగ్రత్త పడాలన్నారు. యువజన వ్యవహారాల శాఖ అసిస్టెంట్ మేనేజర్ ఎన్. నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యువత సాధికారతను పెంపొందించేందుకు పాఠశాలల, కళాశాలల్లో అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. నలుగురిని సన్మార్గంలో నడిపించాల్సిన విద్యార్థులు చెడు ప్రభావాలకు లోను కాకూడదన్నారు. కార్యక్రమంలో వ్యక్తిత్వ వికాస నిపుణులు తేజోవతి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. పద్మలత పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని తాడిగడప మునిసిపాలిటీ సీఐటీయూ అధ్యక్షురాలు యనమల సరళ, గౌరవాధ్యక్షుడు ఉప్పాడ త్రిమూర్తి అన్నారు. పోరంకిలో శనివారం సీఐటీయూ కార్యాలయంలో విలేకరులు వివరాలు తెలిపారు. తాడిగడప మునిసిపాలిటీ ఏర్పడి మూడు సంవత్సరాలు గడుస్తున్నా కార్మికుల సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. కార్మికులకు నెల జీతం రూ. 21 వేలు చేశామని ప్రకటించి పూర్తి జీతం నేటికీ అందలేదన్నారు. కార్మికులకు ఇవ్వాల్సిన దుస్తులు, సబ్బులు, చెప్పులు, గుర్తింపు కార్డులు, ఈఎస్ఐ, పీఎఫ్, పనిముట్లు నేటికీ ఇవ్వలేదన్నారు. నేతలు మధిర కొండలరావు, చొప్పవరపు రత్నకరుణ, తాటిపర్తి వెంకటరెడ్డి పలువురు పాల్గొన్నారు.